క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకోడేరు: మోగల్లు 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకూ పాలకోడేరు, మోగల్లు, కోరుకొల్లు, కుముదవల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన

ఉండి: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకం తప్పనిసరి అంటూ ఉండి పోలీసులు ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. గురువారం ఉండి మండలం చెరుకువాడలో హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడుపుతున్న వారిని నిలిపి వారికి హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. హెల్మెట్ వాడకం భారం అనుకోకుండా బాధ్యతగా తీసుకోవాలని కోరారు.

ఏలూరులో 21న రైతు కూలీ మహాసభ

సాక్షి, భీమవరం: రైతు కూలీల పట్ల మన దృక్పథం మారాలని ఎస్సీ ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గరికిముక్కు సుబ్బయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వేదిక, సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని అన్నీ ప్రాంతాల్లో భూమిలేని పేద రైతు కూలీల సామాజిక, ఆర్థిక సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 21 ఏలూరులో నిర్వహించే రైతు కూలీ మహా సభకు రైతు కూలీలు హాజరుకావాలని కరాఉ.

వీర్రాజుపై అసత్య ఆరోపణలు సహించం

సాక్షి, భీమవరం: భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజుపై జరుగుతున్న భూఆక్రమణల ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. గురువారం భీమవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో నిజాయితీగా నిబద్ధతతో పనిచేస్తున్న వీర్రాజుపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఉన్నమట్ల కబర్ధి, పాకా వెంకటసత్యనారాయణ, ఇంజేటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వీధి లైట్ల సమస్య పరిష్కరించాలని వినతి

సాక్షి, భీమవరం: పట్టణంలోని 38వ వార్డు లంకపేటలో వీధిలైట్లు సమస్య పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సచివాలయం వద్ద ధర్నా చేసి వినతి పత్రం ఇచ్చారు. సీపీఎం టౌన్ నాయకులు వైకుంఠరావు మాట్లాడుతూ వీధిలైట్లు గత పది రోజులుగా వెలగడం లేదని దాని వల్ల రాత్రి సమయాల్లో ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి వీధిలైట్ల సమస్య తీర్చాలని కోరారు.

తుందుర్రు పీహెచ్‌సీ పరిశీలన

భీమవరం అర్బన్: మండలంలోని తుందుర్రు గ్రామంలోని పీహెచ్‌సీని జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ డి. మహేశ్వరరావు గురువారం సందర్శించారు. పీహెచ్‌సీలో వైద్యాధికారి సుగుణరాజు, డాక్టర్ అరుణకుమారి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేస్తుండటంతో ఆ పనితీరును డీఎంహెచ్‌వో మహేశ్వరరావు పరిశీలించి ఆపరేషన్‌లో పాల్గొని ఎలా చేయాలో? పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డి. మహేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనూకుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాలని వైద్యాధికారులకు సూచించారు. జిల్లావైద్యాశాఖాధికారి మహేశ్వరరావు వెంట పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యాధికారి రంగం నాయుడు, ఉండి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ధర్మ తేజ్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



వీరవాసరంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

వీరవాసరం: రాష్ట్రంలో పేదరికాన్ని రూపుమాపి అన్ని వర్గాలు కూడా ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా మళ్లీ ముఖ్యమంత్రిగా జగనే అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ స్పష్టం చేశారు. వీరవాసరంలోని తులసీ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన మండల సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పవన్ కల్యాణ్ భీమవరంలో కూడా జనవాణి నిర్వహించారని, రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారని, అయితే ప్రభుత్వం ఎక్కడా కూడా వాటిని అడ్డుకోలేదని అన్నారు. అనుమతి లేకుండా వైజాగ్ లో కావాలనే జనావాణి పేరుతో ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షను దెబ్బ తీయాలని కుట్రతో ఆనాడు పవన్ కల్యాణ్ వ్యవహరించారని అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కులాలకు, మతాలకు, రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తున్నారని, ఈ విషయాన్ని చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు నేరుగా ప్రజలను అడిగి తెలుసుకోవచ్చు అని అన్నారు. చంద్రబాబు అంటేనే మోసం, కుట్ర, దగా అని మండిపడ్డారు. 2019 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూడా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తూ, ప్రతి కుటుంబం కూడా ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో లక్ష నుంచి 5 లక్షల వరకు కుటుంబాలకు మేలు జరిగే విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తుంటే చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు మాత్రం ప్రజలకు జరిగే మేలును అడ్డుకోవడానికి అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. కరోనా సమయంలో కూడా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వలంటీర్ల ద్వారా ప్రతి ఒక్కరి ఆరోగ్యంపై కూడా శ్రద్ధ పెట్టి పని చేశారని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కరోనా బాధితులకు ఉచితంగా వైయస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో వైద్యాన్ని అందించడంతో పాటుగా, వ్యాక్సినేషన్ కూడా ప్రతి ఒక్కరికి జరిగేలా చర్యలు తీసుకుని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దిన విషయాన్ని ప్రజలు మరిచిపోలేదని అన్నారు. నూతనంగా నియమించిన కన్వీనర్లు, గృహ సారథులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సుపరిపాలనను ప్రతి ఇంటికి వెళ్లి చెప్పడంతో పాటుగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ ల కుట్రలను ప్రజలకు తెలియజేయాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గూడూరి ఓంకారం, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, గొలగాని సత్యనారాయణ, మానుకొండ ప్రదీప్‌కుమార్, కామన నాగేశ్వరరావు, మానేపల్లి నాగన్నబాబు, నూకల కనకారావు, చికిలే మంగతాయారు, గెడ్డం భారతి, నాగరాజు శ్రీనివాసరాజు, ఆదిరెడ్డి అప్పారావు, చవ్వాకుల సత్యనారాయణమూర్తి, బొల్లెంపల్లి శ్రీనివాసచౌదరి పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణాలు ఐక్యతకు నిదర్శనం


విస్సాకోడేరులో శంకుస్థాపన చేస్తున్న శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు

పాలకోడేరు: కమ్యూనిటీ భవన నిర్మాణాలు ఐక్యతకు నిదర్శనమని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు అన్నారు. విస్సాకోడేరు పెద్దపేటలోని స్థానిక సభ్యుల సహకారంతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక భవన నిర్మాణాలు ఐక్యతకు దోహదపడతాయని ఈ భవనాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు భూపతి రాజు చంటి రాజు, సర్పంచ్ బొల్లా శ్రీనివాస్, పెన్మత్స గోపాలకృష్ణంరాజు, మాజీ సర్పంచ్ పెన్మత్స శ్రీనివాసరాజు, దుండి అశోక్ బాబు, వైస్ ఎంపీపీ సోడదాసి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చర్చి ప్రారంభం

పాలకోడేరు: దేవాలయాలు, చర్చిలు, మసీదులను సందర్శిస్తే మానసిక ఒత్తిడి తగ్గి ప్రశాంతత శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు అన్నారు. గురువారం ఆయన గొల్లలకొడేరు లో నూతనంగా నిర్మించిన సెయింట్ పాల్ లూథరన్ చర్చ్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుక్కల లక్ష్మి, ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్, బిషప్ పరదేశి బాబు, ఎమ్మెల్యే మంతెన రామరాజు, కలిదిండి శ్రీనివాసవర్మ, ఎంపీటీసీ సభ్యురాలు కరోతి లక్ష్మి, చేకూరి నరేంద్ర వర్మ తదతరులు పాల్గొన్నారు.

భార్య కనిపించడం లేదని ఫిర్యాదు

పాలకోడేరు: భార్య కనిపించడం లేదని భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు. పోలీసులు కథనం ప్రకారం కోరుకొల్లు గ్రామానికి చెందిన సూర సత్యనారాయణ, భార్య శ్రావణి ఈనెల 15వ తేదీన ఇంట్లో భోజనం విషయంలో గొడవపడ్డారు. దాంతో తెల్లవారుజామున నాలుగు గంటలకు మూడు, ఐదేళ్ల వయసు ఉన్న ఇద్దరు పిల్లలను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఎంతవెతికినా శ్రావణి ఆచూకీ తెలియకపోవడంతో భర్త పోలీసులను ఆశ్రయించాడు.

పేకాట స్థావరం పై దాడి

పాలకోడేరు: మండలంలోని కోరుకొల్లు పేకాట స్థావరం పై దాడి చేసి గురువారం ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.1575 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నాలం శ్రీనివాసరావు తెలిపారు.

గ్యాస్ పేలి తండ్రి కొడుకులకు గాయాలు

పాలకోడేరు: గరగపర్రు నుంచి మోగల్లు వెళ్లే దారిలో రొయ్యల చెరువు గట్టున వున్న ఒక ఇంటిలో బుధవారం రాత్రి గ్యాస్ పేలి తండ్రి కొడుకులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం తూర్పుగోదావరి నుంచి చీలి దానయ్య , భార్య, కొడుకు సతీష్ వచ్చి చెరువుకు కాపలాగా ఉంటున్నారు. చెరువు గట్టున చిన్న పాక వేసుకుని ఆ ఇరుకు ఇంటిలోనే ముగ్గురూ ఉంటున్నారు. అయితే బుధవారం అర్ధరాత్రి గ్యాస్ పేలి తండ్రి కొడుకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయం లో భార్య ఇంటిలో లేకపోవడం తో ప్రమాదం నుంచి తప్పించుకుంది. బాధితులను వెంటనే భీమవరం ఆసుపత్రికు తరలించగా మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రి కి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు

పాలకోడేరు: ఇంట్లో ఎవరూ లేని సమయంలో భార్య ఇంటి నుంచి వెళ్లిపోయిందని భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సంఘటన ఇది. పాలకోడేరు గ్రామానికి చెందిన పెనుమాక సుధాకర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 14న భార్య గంగారత్నం భర్త సుధాకర్ గొడవపడ్డారు. దాంతో 15న పిల్లలను కాన్వెంట్‌కు పంపి ఎవరూ లేని సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల ఎంత వెతికిన ఆచూకీ దొరకపోవడంతో సుధాకర్ పోలీసులను ఆశ్రయించాడని ఏఎస్సై డీవీవీ శ్రీనివాసరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పీఎంపీకి గాయాలు

ఉండి: మండలంలోని వెలివర్రులో గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిలుకూరు గ్రామానికి చెందిన పీఎంపీరామకోటి తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చిలుకూరు నుంచి ద్విచక్ర వాహనంపై ఉండి వైపుగా వస్తున్న రామకోటిని చిలుకూరు వైపుగా వెళుతున్న ఓ వ్యాన్ వెలివర్రు గ్రామంలో ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబికులు చికిత్స నిమిత్తం ఆయనను ముందుగా భీమవరం తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్యం కొరకు ఏలూరు తరలించారు. అయితే ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి సమాచారం లేదని పోలీసులు తెలిపారు.

మైనర్ బాలిక అదృశ్యం

ఆకివీడు: మండలంలోని గుమ్ములూరు గ్రామానికి చెందిన మైనర్ బాలిక ఈ నెల 11వ తేదీన ఇంటి నుండి వెళ్లిపోయినట్లు ఆమె సోదరుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కే.రాజారెడ్డి చెప్పారు.

మహిళపై దాడి

మండలంలోని చినమిల్లిపాడు గ్రామానికి చెందిన విప్పర్తి మణికుమారి ఇంటిపై అదే గ్రామానికి చెందిన కొమ్మిన శాంతకుమారితో పాటు 10 మంది వచ్చి జనవరి 27న దాడి చేసినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజారెడ్డి చెప్పారు. ఇంట్లో నుండి బయటకు వెళ్లి పోవాలని, ఇల్లు ఖాళీ చేయాలని ఇల్లు వదలకపోతే చంపుతామని బెదిరించినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. ఈ విషయాన్ని గ్రామ పెద్దల ముందు ఉంచగా పెద్దల మాట కూడా వినకపోవడంతో మణికుమారి గురువారం పోలీసులను ఆశ్రయించింది.

కొట్టి గాయపరిచారని ఫిర్యాదు

సాక్షి, భీమవరం: పాతగొడవల నేపథ్యంలో తనను ఇద్దరు వ్యక్తులు కొట్టినట్లు టూటౌన్ పరిధిలోని దుర్గాపురానికి చెందిన ఎ.సాత్విక్ ఫిర్యాదు చేశాడని పోలీసులు తెలిపారు. తన ఇంట్లో ఉండగా గురువారం తెల్లవారుజామున ఇంట్లోకి చొరబడి చాకుతో పొడిచేందుకు యత్నించగా తప్పించుకున్నా వెంటపడి గాయపరిచారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఎస్సై పి.అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

18న ఆత్మానందమయి అమ్మ దీక్ష


దీక్ష కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం వీవీఎస్ గార్డెన్స్‌లో ఈ నెల 18న దివ్య బాబాజీ సుషుమ్న క్రియా యోగ పౌండేషన్, అంతర్జాతీయ ఆధ్యాత్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక గురువు ఆత్మానందమయి అమ్మ దీక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పౌండేషన్ ప్రెసిడెంట్ ఎస్ ప్రశాంతి, డాక్టర్ మధుశ్రీ, డాక్టర్ సుతాకీర్తి, విజయలక్ష్మి, మాధవి తెలిపారు. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 18న సాయంత్రం 6 గంటలకు పూజ్యశ్రీ అత్మానందమయి అమ్మ సుషుమ్న క్రియా యోగ సాధనకు సంబంధించిన అనేక సూక్ష్మాలను ఈ కార్యక్రమంలో తెలియజేస్తారని, ఒత్తిడిని తట్టుకోగల శక్తి, నైపుణ్యం, మానసిక ప్రశాంతతను కలుగజేసే చాలా ప్రభావంతమైన ప్రక్రియ ఈ సాధన అని అన్నారు. ఈ మేరకు కార్యక్రమ పోస్టర్ ను ఆవిష్కరించారు. సాయంత్రం 6 నుంచి 8.30 వరకు ధ్యాన శిక్షణ కార్యక్రమం, 11 నుంచి 12 గంటల వరకు మహరుద్రం, రాత్రి 12 గంటల నుంచి 3 గంటల వరకు లింగోద్భవ ధ్యానం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, అందరూ పాల్గొనాలని కోరారు.

ఆన్‌లైన్ యాప్ ద్వారా ఉచిత సర్వీస్


ఎస్‌ఆర్‌కేఆర్ విద్యార్థులు తయారు చేసిన ఆన్‌లైన్ యాప్‌ను ప్రారంభిస్తున్న నిశాంతవర్మ

సాక్షి, భీమవరం: స్థానిక ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ డిజైనింగ్ విద్యార్థినుల ఆధ్వర్యంలో కళాశాల మహిళ హాస్టల్‌లో భీమవరం ఆన్‌లైన్ యాప్‌లో ఎస్‌ఆర్‌కేఆర్ గరల్స్ హాస్టల్ స్టాల్‌ను గురువారం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్‌ఆర్‌కే నిశాంత్ వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టాల్ నిర్వాహకురాలు కంప్యూటర్ సైన్స్ అండ్ డిజైన్ విద్యార్థిని శరణ్య మాట్లాడుతూ ఇంటి వద్ద మహిళలతో తయారు చేసిన చక్కని భోజనంతో పాటు రకరకాల బిర్యానీలు, స్వీట్స్, మెడిసిన్స్ ఎలాంటి సర్వీస్ చార్జీలు లేకుండా అందిస్తామన్నారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి మాత్రమే ఇలాంటి అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే స్టేషనరీ ఐటమ్స్ కూడా అందుబాటులో ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం జగపతి రాజు, ఎస్.గోపాలకృష్ణమూర్తి, హాస్టల్ వార్డెన్ సీఆర్‌కే రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య విద్యార్థికి జాతీయస్థాయి బహుమతి



విద్యార్థి అంజనీవీర్‌ను అభినందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: స్థానిక ఆదిత్య స్కూల్లో 6వ తరగతి విద్యార్థి ఎస్ఎస్ఎంఎస్‌డీ అంజనీవీర్ నేషనల్ అనలైటికల్ ఆటిట్యూడ్ టెస్ట్‌లో జాతీయస్థాయిలో ప్రథమ బహుమతి సాధించాడని స్కూల్ డైరెక్టర్ ఎస్‌వీపీకేహెచ్‌జీ కృష్ణంరాజు చెప్పారు. బహుమతి సాధించిన విద్యార్థి అంజనీవీర్‌ను గురువారం స్కూల్లో అభినందించిన సందర్భంగా ఆయన వివరాలను విలేకరులకు తెలిపారు. విద్యార్థి అంజనీవీర్ ఈనెల 19వ తేదిన హర్యానాలోని పంచకుల ఇంద్ర ధనుష్ ఆడిటోరియంలో హర్యానా విద్యాశాఖా మంత్రి కన్వర్ పాల్ గుర్ జుర్, ప్రపంచ బిలియర్డ్స్ ఛాంపియన్ పద్మశ్రీ గీత్ సేథి చేతుల మీదుగా రూ. 10 వేలు నగదు, బంగారు పతకం, మెమెంటో, ప్రశంసా పత్రము అందుకోనున్నట్లు కృష్ణంరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ టి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు బీవై సుధ, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా ధర్మభిక్షం జయంతి

సాక్షి, భీమవరం: అఖిల భారత గీత, పనివాళ్ల సంఘం మాజీ అధ్యక్షుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు బొమ్మగాని ధర్మభిక్షం శతజయంతి ఉత్సవాలు భాగంగా భీమవరంలో జిల్లా గీత పనివారి సంఘ కన్వీనర్ కడలి మృత్యుంజయుడు అధ్యక్షతన మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మృత్యుంజయుడు మాట్లాడుతూ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చెల్లబోయిన రంగారావు, కిలారి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం


బాబా వారి ఆలయంలో విరాళం అందజేస్తున్న దాతలు

కాళ్ల: మండలంలోని సీసలి గ్రామంలో వేంచేసియున్న షిరిడి సాయిబాబా ఆలయం శాశ్వత అన్నదాన పథకానికి కాళ్ల మండలం బొండాడ వాస్తవ్యులు మందపాటి వెంకట శేషగిరిరావు, వెంకటరమణమ్మ దంపతుల జ్ఞాపకార్థం కుమారుడు సూర్యచంద్రరావు–వీరవెంకటలక్ష్మి దంపతులు రూ.లక్ష విరాళాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్ పర్సన్ తోరం అనంతలక్ష్మి సత్యవతీదేవి వారి కుటుంబ సభ్యులకు బాబా వారి ప్రత్యేక దర్శనం కల్పించి శేషవస్త్రం, బాబా వారి ప్రతిమతో సత్కరించి అభినందించారు.

నేడు ఉండిలో బ్రదర్ అనిల్ సువార్త సభ

ఉండి: ఉండి పెనూయేలు ప్రెయర్ మినిస్ట్రీస్ వారి ఆధ్వర్యంలో బస్టాండ్ ఎదురుగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 18వ వార్షిక సువార్త మహాసభలకు అంతర్జాతీయ ప్రసంగికుడు బ్రదర్ అనిల్‌కుమార్ శుక్రవారం హాజరవుతున్నట్లు పాస్టర్ రెవరెండ్ ఈదా విజయ్‌ప్రసాద్ తెలిపారు. మూడో రోజు సువార్త మహాసభలో ముఖ్య ప్రసంగికులుగా అనిల్‌కుమార్ రానున్నారని తెలిపారు. అధిక సంఖ్యలో విశ్వాసులు సభకు హాజరుకావాలని కోరారు.

ఆర్బీకేల్లో ఎరువుల అమ్మకాలు పెంచాలి

ఆకివీడు: ఆర్బీకేల వద్ద ఎరువుల అమ్మకాల్ని పెంచాలని, రైతులు ఆర్బీకేలను వినియోగించుకునే విధంగా కృషి చేయాలని ఆర్బీకే ఇన్‌చార్జిలకు ఏడీఏ కే.ఎస్.ఎస్.శ్రీనివాస్ రావు సూచించారు. స్థానిక ఏడీఏ కార్యాలయం వద్ద గురువారం ఆకివీడు సబ్ డివిజన్ పరిధిలోని ఆర్బీకే ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ–క్రాప్, ఈకే వైసీ నమోదు చేయాలని సూచించారు. కియోస్క్‌ల వినియోగం ప్రతి రోజూ ఉండాలన్నారు. వ్యవసాయ యాప్‌ల వినియోగం పెంచాలన్నారు. సమావేశంలో ఏఓలు ప్రియాంక, సంధ్య, జయ వాసుకీ, ఆర్బీకే ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

నడివీధికి అమ్మవార్లు

కాళ్ల: కాళ్ల మండలం బోండాడ గ్రామంలో వేంచేసి ఉన్నశ్రీ పోలేరమ్మ, శ్రీ మహాలక్ష్మి అమ్మ వార్లు జాతర సందర్భంగా గురువారం అమ్మవార్లను నడివీధికి తీసుకొచ్చారు. అమ్మవార్లను పూరి గుడిసెలో పెట్టిన సందర్భంగా గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పెనుమత్స రంగరాజు, ఉండి ఏఎంసి మాజీ చైర్మన్ మన్నే నాగరాజు, మన్నె శ్రీనివాస్, కందుల హనుమ, మేక వెంకన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన


బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): దుర్గాపురం హైస్కూల్లో ఐసీడీఎస్ సిబ్బంది బాల్య వివాహాల వల్ల కిశోర బాలికలు ఎదుర్కొనే ఇబ్బందులు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ పీబీవీఎల్ సరోజని మాట్లాడుతూ బాల బాలికలు అందరూ విద్య పై దృష్టి పెట్టి ఉన్నత విద్యావంతులు కావాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు పెళ్లి ప్రయత్నాలు చేస్తే ముందుగా తల్లిదండ్రులను ఒప్పించి తాము బుద్ధిగా చదువుకొని ముందుకు వెళతామని నమ్మకాన్ని వారికి పిల్లలు కలిగించాలన్నారు. కనీసం డిగ్రీ వరకు చదువుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వేగేశ్న విశ్వనాథ రాజు, ఏఎన్‌ఎం ఉషశ్రీ, స్థానిక అంగన్‌వాడీ టీచర్స్ చిన్నారమ్మ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో విచారణ

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి గ్రామంలోని 46 అంగన్‌వాడీ కేంద్రంలో అవినీతి జరిగిందని వచ్చిన ఆరోపణలపై ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారిణి రత్నకుమారి గురువారం విచారణ నిర్వహించారు. విచారణలో స్టాక్ రిజిస్టర్‌లో కంటే బియ్యం అదనంగా ఉన్నాయని, వాటిపై సంబంధిత కార్యకర్తకు మెమో ఇచ్చినట్లు రత్నకుమారి తెలిపారు.